క్లుప్తంగా

ఆర్జిత సేవలు పునరుద్ధరణ

వైభవంగా నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఆర్జిత సేవలు పునరుద్ధరించారు. సుదర్శన నారసింహ మహాయజ్ఞం కారణంగా గత నెల 26 నుంచి జరిగిన ఈ నెల 2వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో తిరిగి బుధవారం నుంచి ఆర్జిత సేవలు పునః ప్రారంభించారు. ఉదయం 9.30 నుంచి స్వామికి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపం లోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సబ్బవరం పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్షిస్తున్న జిల్లా అధికారి బాలాజీ

సబ్బవరం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఎయిడ్స్, కుష్టు, క్షయ నిర్మూలనాధికారి ఎంఈవీఎస్‌కే బాలాజీ సూచించారు. సబ్బవరం పీహెచ్‌సీ సిబ్బందితో బుధవారం జాతీయ కార్యక్రమాలైన ఎయిడ్స్,క్షయ,కుష్టు వ్యాధుల నిర్మూలకు తీసుకుంటున్న చర్యలపై ఆయన సమీక్షించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గైనిక్ వార్డ్‌ను పరిశీలించి, కుటుంబ నియంత్రణపై ఆరా తీశారు. పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి,డాక్టర్ ఆశ,డాక్టర్ విద్యాదరి, సిబ్బంది వై. స్వర్ణలత,జేసుదాసు,కె. రవి, రాంబాబు,ఎస్. రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: చీమలాపల్లి 33/11కేవీ.. పురుషోత్తపురం 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. చీమలాపల్లి, వరలక్ష్మినగర్, సంతోష్ నగర్, బ్రహ్మంగారి మఠం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పెందుర్తి కాంగ్రెస్ అభ్యర్థిగా భగత్



పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆర్ఆర్ వెంకటాపురానికి చెందిన పిరిడి భగత్‌ను ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. కాంగ్రెస్‌లో యువజన నాయకుడిగా ఉన్న భగత్ గత సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేశారు.

కాంగ్రెస్‌కు వేగి దివాకర్ గుడ్‌బై



పెందుర్తి: కాంగ్రెస్ పార్టీకి ఆ పార్టీ సీనియర్ నాయకుడు వేగి దివాకర్ రాజీనామా చేశారు. పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తనను ప్రకటించకుండా స్థానికేతరుడికి టికెట్ ఇచ్చినందుకు నిరసనగా పార్టీ నుంచి వైదొలగుతున్నట్లు వేగి ప్రకటించారు. తన రాజీనామాను తక్షణమే ఆమోదించాలని అనకాపల్లి డీసీసీ అధ్యక్షుడికి లేఖ రాశారు.

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1147వ రోజుకు చేరుకున్నాయి. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబూ..నీకిది తగునా?

నా పేరు పిల్లల సన్యాసి(84). మాది రాయపుర అగ్రహారం. వయసు మీదపడంతో కాళ్లు రావడం లేదు.ఇద్దరు సాయం చేస్తే తప్ప కుర్చీలో నుంచి లేవలేను. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవాడు. ఇప్పుడు మా గ్రామం నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న బంగారమ్మపాలెం సచివాలయానికి వెళ్లాలని చెబుతున్నారు. మా లాంటి వాళ్లను ఇబ్బంది పెట్టడం ఎంత వరకు న్యాయం.?



ఇలా ఒక్కరు కాదు.. పింఛన్ దారులంతా దుమ్మెత్తి పోస్తున్నారు. నిస్సహాయులకు మేలు జరిగే విషయంలో కూడా ఫిర్యాదులు చేసి ఇబ్బంది పెట్టిన వారికి తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు.

- ఇంటింటి పింఛన్ల పంపిణీ నిలిచిపోవడంతో అవ్వాతాతల ఆగ్రహం
- సచివాలయాల వద్ద ఉదయం నుంచి పడిగాపులు
- వలంటీర్లను దూరం చేయడంపై సర్వత్రా నిరసన

పెందుర్తి/పరవాడ/సింహాచలం/సబ్బవరం: 'సరిగ్గా ఐదేళ్ల కిందట ఇలాంటి కష్టాలే ఉండేవి. పింఛన్ల కోసం రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవాళ్లం. కానీ జగన్ బాబు వచ్చాక ఐదేళ్లుగా వలంటీర్లు ఇంటికే తీసుకువచ్చి పింఛన్లు అందించేవారు. మళ్లీ చంద్రబాబు కుట్ర పుణ్యమా అని మళ్లీ పాత రోజులు వచ్చాయి. ఇలాంటి దుర్మార్గుల వలనే మాకు ఈ తిప్పలు' అంటూ నియోజకవర్గంలోని అవ్వాతాతలు, దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలనెలా నేరుగా ఇంటికే వచ్చి పింఛన్లు అందించే వలంటీర్లను కుట్రపూరితంగా సేవలకు దూరం చేయడంతో పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని పింఛన్ దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు.



గొర్లివానిపాలెం సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

ఇబ్బందులు పడ్డ దాదాపు28 వేల మంది

నియోజకవర్గ పరిధిలోని పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో 4033 మందికి, సబ్బవరంలో 7,744 మందికి, పరవాడలో 5,922 మందికి, జోన్-8 పరిధిలో 17,668 మందికి సామాజిక పింఛన్లు ప్రభుత్వం అందిస్తుంది. టీడీపీ, చంద్రబాబు సానుభూతిపరులు ఫిర్యాదుల కారణంగా వలంటీర్లు సేవల నుంచి తప్పించడంతో వీరంతా వెళ్లి సచివాలయాల వద్ద పింఛన్ల కోసం ఉదయం నుంచి పడిగాపులు కాశారు. కొన్నిచోట్ల శివారు గ్రామాలకు అధికారులు వెళ్లి పింఛన్లు అందించారు.



దువ్వపాలెంలో పింఛన్ల కోసం వేచి ఉన్న పింఛన్ దారులు

పింఛన్ కోసం పాట్లు

పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు నానా అవస్థలు పడ్డారు. జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని తొమ్మిది సచివాలయాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే వారిని చంద్రబాబు తన వారితో ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదు చేయించడంతో తమకు కష్టాలు వచ్చాయని వృద్ధులు, దివ్యాంగులు మండిపడ్డారు. మండుటెండలోనే తమ కుటుంబీకుల సాయంతో సచివాలయాలకు చేరుకున్నారు.



అడవివరంలోని 526 సచివాలయానికి వేరొకరి సాయంతో సచివాలయానికి వస్తున్న వృద్ధురాలు సన్యాసమ్మ



పినగాడిలో పెళ్లి మండపం నుంచి వచ్చి పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగుడు మాదెం రాజు



సింహపురికాలనీలో యువకుడి సాయంతో సచివాలయానికి వెళ్తున్న వృద్ధురాలు



నడవలేని స్థితిలో వృద్ధురాలు సుభద్ర



జుత్తాడలో పింఛన్ల కోసం వేచి ఉన్న పింఛన్‌దారులు

అనారోగ్యంతో బాధపడుతున్నా..



కొన్నేళ్ల నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాను. లేవలేని పరిస్థితిలో ఉన్న నాకు ప్రభుత్వం అందించే పింఛన్‌ను ప్రతీ నెల వలంటీరు ఇంటికి తెచ్చి అందజేసేది. ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం చంద్రబాబు పుణ్యమాని లేవలేని స్థితిలో ఉన్న నేను పింఛన్ కోసం మరొకరి సాయంతో సచివాలయానికి వచ్చాను. ఈ కష్టాలు ఎంతకాలం ఉంటాయో తెలీదు. జగన్‌బాబు హయాంలోనే బాగుండేది.

– పోలాపు పైడితల్లి, వాడచీపురుపల్లి

నడిచి రావడం కష్టంగా ఉంది



ప్రతీ నెలా వలంటీరమ్మ వచ్చి పింఛన్ ఇచ్చేది. ఈ నెల రాలేదు. మా లాంటి పింఛన్‌దారులను కష్టాలకు గురి చేయడం చంద్రబాబు తగదు. వృద్ధాప్యం మీద పడి నడవలేని పరిస్థితిలో ఉండి సచివాలయానికి ఎంతో కష్టపడి నడిచొచ్చా. మమ్మల్ని కష్టాలు పెడుతున్న చంద్రబాబుకు మా ఉసురు తగలకమానదు.

– కూండ్రపు ఎర్రయ్యమ్మ, నాయుడుపాలెం

ఎండకు ఆరోగ్యం దెబ్బతింటే..



ప్రతీ నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ నగదు ఇచ్చేవారు. ఎంతో సంతోషంగా ఉండేది. ఇప్పుడు సచివాలయానికి ఎంతో ఇబ్బంది పడి వచ్చాం. మూడు కిలోమీటర్లు ఎండలో ప్రయాణించి అడవివరంలోని సచివాలయానికి రావాల్సి వచ్చింది. నాకు ఆరోగ్య ఇబ్బందులు ఉన్నాయి.ఎండ దెబ్బకు అనారోగ్య సమస్యలు తలెత్తితే ఎవరు బాధ్యత తీసుకుంటారు. ఈ పరిస్థితికి కారణమైన వారు బాగుపడరు.

– వి.వి.సుభద్ర, గొల్లనారాయణపురం

కలసికట్టుగా పని చేద్దాం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పరవాడ: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అంతా సమష్టిగా పని చేద్దామని ఎమ్మెల్యే, పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ బుధవారం పరవాడ మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ముచ్చటించారు. మండలంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై నాయకులతో కలిసి చర్చించారు. గతంలో ఏవైనా పొరపాట్లు జరిగితే వాటిని సరిచేసుకుంటానని తెలిపారు. అంతా కలసి తన విజయానికి కృషి చేయాలని అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు భగవాన్ జయరామ్, కొటాన రాము, కోన రామారావు, వెన్నల సన్యాసిరావు, నాయకులు పైల అప్పలనాయుడు, గొర్లి గోపి, పోతల అప్పలనాయుడు, పరవాడ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో నాయకులతో అదీప్‌రాజ్

అగనంపూడి: ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం కోసం పార్టీలోని కార్యకర్త నుంచి నాయకుల వరకు కలిసికట్టుగా పని చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. 85వ వార్డు లంకెలపాలెంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలోని బీసీ నాయకుడు నెల్లి కన్నబాబు స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ విజయానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుందరపు అప్పారావు, యలమర్తి వెంకటరావు, కర్రి నరసింగరావు, కాతా నూకేష్, సిమ్మ సునీల్, గొల్లవిల్లి శ్రీను, కొటాన రాము, మోపాడ అప్పారావు, వడ్డాది అప్పలరాజు, ఎడ్ల నాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న చుక్క రామునాయుడు

వెంకన్న హుండీ ఆదాయం రూ. 8.09 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: పెందుర్తి వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో 90 రోజులకు వచ్చిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.8,09,252 నగదును భక్తులు సమర్పించారని ఈవో నీలిమ వెల్లడించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవదాయ శాఖ భూముల పరిరక్షణకు చర్యలు

కమిషనర్ సత్యనారాయణ

మధురవాడ: దేవదాయ శాఖ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్న ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ చెప్పారు. బుధవారం ఆయన అధికారులతో కలసి మధురవాడ జోనల్ కార్యాలయం సమీపంలోని సర్వే నంబర్ 12లో గల భూములు, అందులోని ఆక్రమణలు పరిశీలించారు. ఇక్కడ ఉన్న సుమారు 18 ఎకరాలతో పాటు ఇతర భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ శిరీష, డిప్యూటీ కమిషనర్ సుజాత ఉన్నారు.



మధురవాడలో దేవదాయ శాఖ భూములు పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

వివాహిత బలవన్మరణం



భర్త, కుమార్తెలతో సౌజన్య(ఫైల్)

గోపాలపట్నం: సీతారామరాజు నగర్‌లో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీ సమీపంలోని సీతారామరాజు నగర్‌లో గల వీకే ఆర్కేడ్ అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో గోపిదైల సౌజన్య(33), భర్త రామకృష్ణ, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తోంది. మంగళవారం రాత్రి భర్త, పిల్లలతో కలిసి బెడ్ రూమ్‌లో నిద్రించింది. మధ్య రాత్రి సమయంలో హాల్‌లోకి వచ్చి ఫ్యాన్‌కు చున్నీ కట్టి ఉరి వేసుకుంది. పెద్ద కుమార్తె ఇషిత చూసి తండ్రికి తెలియజేసింది. ఆమెను కిందకి దించి 100కు డయల్ చేసి భర్త సమాచారమిచ్చారు. టీపీటీ కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రామకృష్ణ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఇషిత(13), రితిక(10) ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు, ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మానసిక ఆందోళన కారణంగా ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి బాబూరావు చెబుతున్నాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు సౌజన్య మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

నేడు మొదటి విడత ర్యాండమైజేషన్

మహారాణిపేట: ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్ అధికారులకు గురువారం మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులను నిర్ణయించనున్నట్లు వెల్లడించారు. వీరందరికీ మొదటి విడత శిక్షణను ఈ నెల 10 నుంచి నిర్వహిస్తామన్నారు. ఏ ఉద్యోగికీ ఇందులో మినహాయింపు లేదని.. ఎవరైనా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

నియోజకవర్గం	శిక్షణ కేంద్రం	శిక్షణ తేదీ
భీమిలి	ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, సంగివలస	10, 12
విశాఖ తూర్పు	ఏయూ సివిల్ ఇంజనీరింగ్ క్లాస్ రూమ్	10,12
విశాఖ దక్షిణ	ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, జైల్‌రోడ్	10
విశాఖ ఉత్తర	ఏయూ మెయిన్ ఇంజనీరింగ్ బ్లాక్	10,12
విశాఖ పశ్చిమ	ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బ్లాక్	10,12
గాజువాక	టీఎస్సార్ అండ్ టీబీకే డిగ్రీ కాలేజీ ,శ్రీనగర్, గాజువాక	10,12
పెందుర్తి	పెందుర్తి గవర్నమెంట్ హైస్కూల్	10,12

క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజులా, ఫిజికల్ డైరెక్టర్ కిరణ్మయి

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభించారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల ప్రారంభించారు. నేటి యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి శిక్షణ శిబిరాలు ఎంతగానో అవసరమని, ఎక్కువ సమయం సెల్‌ఫోన్లతో గడుపుతూ విద్యార్థులు ఊహా ప్రపంచానికి అలవాటు పడి, నిజ జీవితంలో సమస్యలు ఎదుర్కొనే నైపుణ్యాన్ని కోల్పోతున్నారని చెప్పారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి మాట్లాడుతూ 45 రోజుల పాటు సాగే శిక్షణలో 60 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. బోత్రా షిప్పింగ్ సర్వీసెస్, సాయి సంస్థాన్ చారిటబుల్ ట్రస్ట్ ఈస్ట్ షిర్డీ సహకారంతో విద్యార్థులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మే 31 వరకు ప్రావీణ్యత గల కోచ్‌ల సహకారంతో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, కరాటే, వెయిట్‌లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, రెస్లింగ్, యోగా, క్రికెట్, బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో ఇవ్వనున్న శిక్షణలో విద్యార్థినులు పాల్గొనాలని కోరారు.

ఏఆర్‌సీకి ఎలుగుబంటి తరలింపు

ఆరిలోవ: శ్రీకాకుళం జిల్లా అడవుల్లో సంచరిస్తూ అటవీ అధికారులకు చిక్కిన ఎలుగుబంటిని విశాఖ జంతు పునరావాస కేంద్రాని(ఏఆర్‌సీ)కి తరలించారు. జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా అడవుల నుంచి మంగళవారం ఉదయం జనారణ్యంలోకి వచ్చిన ఓ ఎలుగుబంటి వజ్రపు కొత్తూరు మండలం మెట్టూరు గ్రామంలో పాడుబడిన ఇంట్లోకి చేరింది. శ్రీకాకుళం అటవీ డివిజన్ అధికారులు, విశాఖ జూ రెస్క్యూ టీం సమన్వయంతో దాన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. జూ వైద్యులు ఆ ఎలుగుబంటికి అక్కడే ప్రాథమిక పరీక్షలు చేసి శరీరంపై కొన్నిచోట్ల గాయాలున్నట్లు గుర్తించారు. అనంతరం అక్కడి నుంచి మంగళవారం రాత్రి 11 గంటలకు విశాఖలో ఏఆర్‌సీకి తీసుకొచ్చారు. ఎలుగుబంటికి శారీరక, మానసిక ఆరోగ్యం కోసం తగిన చికిత్స, ఆహారం అందిస్తున్నారు.

వసతి గృహంలో పనులు ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల వసతిగృహంలో అవసరమైన మరమ్మతులు చేపట్టారు. మంగళవారం రాత్రి స్వయంగా హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా సిబ్బంది పరిశీలించారు. సత్వరం చేపట్టాల్సిన పనులను ప్రణాళిక సిద్ధం చేసుకుని, బుధవారం ఉదయం యూనివర్సిటీ చీఫ్ ఇంజినీర్ ఆర్.శంకరరావు సిబ్బందితో వెళ్లి అవసరమైన పనులపై వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం టాయిలెట్స్ బ్లాక్‌లో కుళాయిలు, సింక్‌లు, ఫ్లష్ ట్యాంక్‌లు కొత్తవి ఏర్పాటు చేశారు. తరచూ నీటి పైపులు పాడవకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. వీటితో పాటు బాత్ రూంలలో షవర్లను ఏర్పాటు చేశారు. టాయిలెట్స్‌లో విద్యార్థినులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి అవసరమైన అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఇప్పటికే అన్ని హాస్టల్స్‌లో టాయిలెట్స్‌ని మార్పు చేయడం, గదులను ఆధునీకీకరించడం వంటి పనులను ప్రారంభించారు. తాజాగా మేరీ క్యూరీ హాస్టల్ భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టారు.

హెచ్‌ఎస్‌ఎల్‌ను సందర్శించిన ఈఎన్‌సీ చీఫ్



షిప్‌యార్డ్‌లో చేపట్టిన పలు ప్రాజెక్ట్‌లను వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌కు వివరిస్తున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ బుధవారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా షిప్‌యార్డ్‌లో జరుగుతున్న విస్తరణ పనులతో పాటు భవిష్యత్తు ఓడ నిర్మాణ ప్రాజెక్ట్‌లు, వాటి మరమ్మతులు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను షిప్‌యార్డ్ అధికారులు వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌కు వివరించారు. అనంతరం ఇండియన్ నేవీ కోసం నిర్మిస్తున్న డైవింగ్ సోర్ట్ వెసెల్‌ను కూడా సందర్శించారు.